క్లుప్తంగా

హైటెన్షన్ అలైన్‌మెంట్ మార్చాలి

కడ్తాల్: పంట పొలాల మీదుగా తీస్తున్న 765కేవీ హైటెన్షన్ సోలార్ విద్యుత్ లైన్ అలైన్‌మెంట్‌ను మార్చాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. హైటెన్షన్ లైన్ అలైన్‌మెంట్‌ను మార్చాలని డిమాండ్ చేస్తూ బాధిత రైతులు చేపట్టిన దీక్ష గురువారానికి 18వ రోజుకు చేరుకుంది. దీక్షలకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. పేద రైతులను ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. అలైన్‌మెంట్ మార్చాలని, లేని పక్షంలో రైతులకు అండగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో రాజేందర్‌యాదవ్, రామకృష్ణ, పర్వత్‌కుమార్‌యాదవ్, అభిషేక్‌రెడ్డి, కల్యాణ్‌కర్ వెంకటేశ్, మహేశ్, పెంటారెడ్డి, కృష్ణయాదవ్, అశోక్, రాములు యాదవ్, శ్రీరాములు తదితరులు ఉన్నారు.

ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన దీపిక


విద్యార్థినికి స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

ఆమనగల్లు: పట్టణానికి చెందిన పెరికేటి యాదయ్య, సుజాత దంపతుల కూతురు సాయిదీపిక నీట్‌లో ర్యాంక్ సాధించి, సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా దీపికను తల్లిదండ్రులు అభినందించారు.

మొక్కలు నాటిన బీజేపీ నేతలు


ఆస్పత్రి ఆవరణలో మొక్క నాటి, నీరు పోస్తున్న బీజేపీ నేతలు

ఇబ్రహీంపట్నం: జనసంగ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతిని గురువారం పట్నంలో బీజేపీ నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వాసుపత్రిలో మొక్కలు నాటి నివాళులర్పించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నేతలు వెంకటేశ్‌గౌడ్, మహేశ్, మహేందర్, విజయ్‌కుమార్, సురేశ్, శివకుమార్, అభిషేక్, బాలునాయక్, రజనీ, సాయిరాం, శశిధర్‌రెడ్డిలు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం


నటి శ్యామలకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

కడ్తాల్: ఎక్వాయిపల్లి గ్రామంలో నిర్వహించనున్న దుర్గామాత బ్రహ్మోత్సవాలకు.. సినీనటి శ్యామలను బీఆర్‌ఎస్ పార్టీ యువ నాయకుడు మహేశ్‌యాదవ్ ఆహ్వానించారు. ఈ మేరకు నగరంలోని ఆమె నివాసంలో గురువారం కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. నాయకులు శేఖర్‌యాదవ్, సురేశ్, బన్ని తదితరులు ఉన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి


పత్తిపంటను పరిశీలిస్తున్న ఏఓ

ఆమనగల్లు: పత్తిపంటపై పురుగుమందులు పిచికారీ చేయడంతో దిగుబడి తగ్గే అవకాశాలు ఉన్నాయని, దీనికి బదులు సూక్ష్మపోషకాలను వినియోగించాలని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల పరిధి ఆకుతోటపల్లిలో పత్తిపంటలను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. సూక్ష్మపోషకాల లోపం వలన పత్తి మొక్కలు ఎర్రబారి చనిపోతాయని, యాజమాన్య పద్ధతులు పాటిస్తూ.. తగిన పోషకాలను పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

రహ‘దారుణం’

కురుస్తున్న వర్షాలతో గ్రామీణ ప్రాంతాల రోడ్లు అధ్వానంగా మారాయి. గుంతలు పడి, కయ్యలు ఏర్పడి, కంకరతేలి వాహనదారులకు నరకం చూపుతున్నాయి. గోతుల్లో నీరు నిలిచి.. గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి.


చాంద్‌ఖాన్ గూడ ఆరుట్ల రోడ్డు పరిస్థితి

గుంతల రోడ్లు.. గుండెల్లో గుబులు

- ఏళ్లు గడిచినా మారని రోడ్ల దుస్థితి
- మరమ్మతులకు నిధుల కేటాయింపు
- అయినా నిర్లక్ష్యం వీడని అధికార యంత్రాంగం

మంచాల: మండల పరిధి 23 పంచాయతీల్లో ప్రధాన రోడ్లు 80 శాతం వరకు పూర్తయ్యాయి. లింకు రోడ్లు మిగిలి ఉన్నాయి. అందులో నిధుల లేమితో జాపాల నుంచి గున్‌గల్ వరకు, బుగ్గతండా నుంచి ఎల్లమ్మతండా ఎక్స్‌రోడ్డు వరకు మరమ్మతుకు నోచుకోలేదు. దీంతో ఆయా రహదారులు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ఇటీవల కాలంలో గిరిజన సంక్షేమ అభివృద్ధిశాఖ కింద రంగాపూర్ నుంచి మాల్ వరకు లింకు రోడ్డు అభివృద్ధికి 12 కిలో మీటర్లకు రూ.9 కోట్లు మంజూరు అయ్యాయి. అదే విధంగా బండలేమూర్ నుంచి కేలోత్‌తండా 9 కి.మీ.కు రూ.6 కోట్లు కేటాయించింది. కానీ పనులు ప్రారంభం కాలేదు. ఆగాపల్లి నుంచి నోముల వరకు 4కిలో మీటర్ల రోడ్డుకు రూ.4 కోట్లు విడుదల చేశారు. ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

కంకరపోసి వదిలేశారు

రెండున్నర సంవత్సరాల క్రితం నాగార్జునసాగర్–హైదరాబాద్ హైవే నుంచి కాగజ్‌ఘట్, జాపాల మీదుగా మంచాల వరకు రోడ్డు నిర్మాణానికి నాటి ప్రభుత్వం రూ.4.30 కోట్ల నిధులు మంజూరు చేసింది. రోడ్డు విస్తరణ పనులు కొంత వరకు చేశారు. రోడ్డుకు ఇరువైపులా కంకర పోసి వదిలేశారు. చాంద్‌ఖాన్ గూడ గేట్ నుంచి బుగ్గతండా వరకు రూ.32 లక్షలు మంజూరు అయ్యాయి. అది కూడా కంకర పోసి విస్మరించారు. నిధులు మంజూరు అయి, పనులు ప్రారంభించి, మధ్యలో వదిలేయడంతో ఆయా రోడ్లు.. ప్రస్తుతం కురుస్తున్న వానలకు ఆనవాళ్లు కోల్పోయాయి. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

తరచూ ప్రమాదాలు



ఆగాపల్లి వయా కాగజ్ ఘట్, జాపాల మీదుగా మంచాల రోడ్డు చాల ప్రమాదకరంగా మారింది. గోతులు ఏర్పడి రాక పోకలకు అంతరాయం కలుగుతోంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇదే విషయాన్ని సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవటం లేదు. తక్షణమే మరమ్మతు పనులు చేయించాలి.

– బాలరాజ్, మంచాల

రెండేళ్లు అయింది..



చాంద్‌ఖాన్ గూడ గేట్ నుంచి బుగ్గతండా గేట్ వరకు రోడ్డు పనులు ప్రారంభించి రెండేళ్లు కావొస్తోంది. కానీ పనులు పూర్తి కాలేదు. వర్షాలకు గోతులు ఏర్పడ్డాయి. జాపాల్– ఆగాపల్లి రోడ్డు దుస్థితి అలాగే ఉంది. అధికారులు స్పందించి, రవాణా సౌకర్యాన్ని మెరుగు పర్చాలి.

– చంద్రకాంత్, జాపాల

చర్యలు తీసుకుంటాం

ఆగాపల్లి టు మంచాల రోడ్డు, చాంద్‌ఖాన్ గూడ గేట్ నుంచి బుగ్గతండా రోడ్డు పనులు త్వరలోనే పునప్రారంభిస్తాం. కొంత ఆలస్యం అయింది. వర్షాలు తగ్గుముఖం పట్టగానే నిర్మాణ పనులకు చర్యలు చేపడతాం. రవాణా మార్గాన్ని మెరుగు పరుస్తాం.

– మల్లారెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ, ఏఈ

ఘనంగా దీన్‌దయాల్ జయంతి


తుర్కయంజాల్: దీన్‌దయాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నివాళులర్పించిన బీజేపీ నాయకులు

తుర్కయంజాల్: పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ జిల్లా నాయకుడు కందాల బల్‌దేవ్ రెడ్డి అన్నారు. దీన్‌దయాల్ జయంతిని పురస్కరించుకొని గురువారం పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు చేరేలా కమలనాథులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కోశాధికారి కొత్త రాంరెడ్డి, నాయకులు సురేశ్, రవీందర్ రెడ్డి, కృష్ణ, వెంకటేశ్, కార్తీక్, యూసుప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాడ్గులలో..

మాడ్గుల: పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకొని మండల పరిధి నర్సంపల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు పెద్దయ్య అధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. ఆయన ఆశయాలను అనుగుణంగా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు.

యాచారంలో..

యాచారం: దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతిని బీజేపీ మండల అధ్యక్షుడు విజయ్‌నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దయాల్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళుర్పించారు. అనంతరం మొక్కలు నాటారు. నాయకులు అంజయ్యయాదవ్, విష్ణుమూర్తి, రాజు, మధుకర్‌రెడ్డి, రమేష్, రవీందర్ ఉన్నారు.


మాడ్గుల: నర్సంపల్లి గ్రామంలో..


యాచారంలో..

నేడు ఐద్వా ఆధ్వర్యంలో బతుకమ్మ


సుమలత, ఐద్వా జిల్లా కార్యదర్శి

ఇబ్రహీంపట్నం: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం పట్నంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బతుకమ్మ సంబురాలను నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి సుమలత గురువారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ రానున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు, జయప్రదం చేయాలని కోరారు.

అవార్డు గ్రహీతకు సన్మానం


భిక్షపతిని సన్మానిస్తున్న సంఘం నేతలు

ఇబ్రహీంపట్నం: ప్రొఫెసర్ జయశంకర్ విద్యారత్న అవార్డు గ్రహీత డాక్టర్ ఎస్‌కే భిక్షపతిని పట్నం వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం సెంట్రల్ సభ్యుడు శెట్టి శివకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దడమేగాక, మహాత్మ బసవేశ్వరుడు చూపిన బాటలో పయనిస్తూ.. వీరశైవ సమాజం అభ్యున్నతికి భిక్షపతి ఎంతో సేవ చేస్తున్నారని తెలిపారు. సంఘం నాయకులు విజయ్, విశ్వనాథ్, ఆనందప్ప తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- కాంగ్రెస్‌తోనే అన్నదాతల ఆర్థికాభివృద్ధి
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- ఉచితంగా వేరుశనగ విత్తనాల పంపిణీ

ఆమనగల్లు: రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలం పడకల్ సింగిల్ విండో గోదాంలో గురువారం జాతీయ నూనెగింజల పథకం కింద రైతులకు ఉచితంగా వేరుశనగ విత్తనాలను ఎమ్మెల్యే పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పాలనలోనే అన్నదాతలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పంట రుణం మాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్‌తో పాటు.. అనేక పథకాలు అమలు చేస్తున్న ఘనత మాదేనన్నారు. ఆయిల్‌ఫాం, కూరగాయల సాగుకు 90శాతం రాయితీ అందిస్తుందని చెప్పారు.

2500 ఎకరాల్లో వేరు శనగ

ప్రస్తుతం జాతీయ నూనెగింజల పథకం కింద వంద శాతం రాయితీపై వేరశనగ విత్తనాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే కసిరెడ్డి తెలిపారు. ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల్లో 2500 ఎకరాలలో వేరుశనగ పంట సాగుకు విత్తనాలు పంపిణీ చేశామన్నారు. అలాగే 500 ఎకరాల్లో పొద్దుతిరుగుడు సాగుకు విత్తనాలు అందజేస్తామని చెప్పారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ యాటగీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ కేశవరెడ్డి, వ్యవసాయశాఖ ఏడీఎలు పద్మజ, శోభారాణి, రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య అధ్యక్షుడు హరిమోహన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌యాదవ్, కృష్ణ, ఆరీఫ్, నరేశ్, రమేశ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.


పడకల్‌లో రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

రోడ్డు భద్రత నియమాలు పాటించండి

ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్

కడ్తాల్: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించి, సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుకోవాలని షాద్‌నగర్ ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండల కేంద్రం సమీపంలో టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. పత్రాలను పరిశీలించి మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, ఇతర వాహనదారులు సీటు బెల్టు తప్పని సరిగా ధరించాలని సూచించారు. కూడళ్ల వద్ద సిగ్నల్స్‌ను అనుసరించి, నియంత్రిత వేగంతో ముందుకు సాగాలన్నారు. ఫోన్ మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు. ఇన్స్‌రెన్స్, రిజిస్ట్రేషన్, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర పత్రాలను కలిగి ఉండాలని స్పష్టం చేశారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


వాహన పత్రాలు పరిశీలిస్తున్న సీఐ చంద్రశేఖర్

పశుపోషణలో జాగ్రత్తలు తప్పనిసరి

మండల పశువైద్యాధికారి భానునాయక్

కడ్తాల్: పశుపోషణలో పోషకులు జాగ్రత్తలు, మెలకువలు పాటించాలని మండల పశువైద్యాధికారి భానునాయక్ సూచించారు. గురువారం మండల పరిధి పల్లెచెలకతండాలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆవులకు గర్భధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దూడలకు నట్టల నివారణ మందులు అందజేశారు. సాధారణ జ్వరంతో బాధపడుతున్న పశువులను పరీక్షలు నిర్వహించి మందులు, మినరల్ మిక్చర్, పౌడర్ పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ.. పశువులు వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.


పశువులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

ఆదిబట్ల కమిషనర్ బాలకృష్ణ

ఇబ్రహీంపట్నం రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదిబట్ల మున్సిపాలిటీ కమిషనర్ బాలకృష్ణ అన్నారు. గురువారం 'స్వచ్ఛతా హీ సేవా.. ఏక్ సత్ ఏక గంట' శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిబట్ల టీసీఎస్ ఎదుట చీపురు పట్టి ఊడ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీల్లో చెత్త లేకుండా చూడాలన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కేంద్రంలో చెరువు కట్టపై లయన్స్‌క్లబ్ సహకారంతో శ్రమదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మెన్ ఆకుల యాదగిరి, నాయకులు కేవీ రమేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.


తుర్కయంజాల్: ఇంజాపూర్‌లో..


ఆమనగల్లు: హోమం నిర్వహిస్తున్న భక్తులు


ఆమనగల్లు: భక్తమార్కండేయ స్వామి సన్నిధిలో..

భక్తిశ్రద్ధలతో నవరాత్రోత్సవాలు

దేవీ నవరాత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. నాలుగోరోజు గురువారం అమ్మవారు అన్నపూర్ణేశ్వరి, భవానీగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గ పరిధి ప్రాంతాల్లో ఆలయాలు, మండపాల్లో కొలువైన దుర్గామాతకు నిర్వాహకులు వేద పండితులచే మంత్రోచ్చారణలతో విశేషపూజలు, హోమం, అర్చనలు నిర్వహించారు. మండపాల వద్ద అన్నదానం చేశారు.

–సాక్షి, నెట్‌వర్క్


కడ్తాల్: చరికొండలో కనకదుర్గామాత సన్నిధిలో భక్తులు


ఇబ్రహీంపట్నం: కాత్యాయినిగా రాజరాజేశ్వరి దేవి


కడ్తాల్: మైసిగండి మైసమ్మ సన్నిధిలో..


ఆమనగల్లులో..


కడ్తాల్: పాలశీతలీకరణ కేంద్రంలో..


ఆమనగల్లు: శెట్టిపల్లిలో..

ఉత్సాహంగా బతుకమ్మ సంబురం


బతుకమ్మలతో విద్యార్థినులు

ఇబ్రహీంపట్నం: బతుకమ్మ సంబురాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం పట్నంలోని విద్యాంజలి వొకేషనల్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థినులు సందడి చేశారు. తీరొక్క పూలతో పూలగోపురాలను తీర్చిదిద్దారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో ప్రతిష్ఠించి ఆడిపాడారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అనితకుమారి వేడుకల చరిత్ర, విశిష్టత గురించి వివరించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అయువుపట్టు బతుకమ్మ (గౌరమ్మ) అని తెలిపారు. మన ఆచార వ్యవహారాలను, సంస్కృతి సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు సరస్వతి, శోభారాణి, జాన్సి, సంధ్య, సౌమ్య, శ్రీలత పాల్గొన్నారు.

గాన గంధర్వుడికి నివాళి

కందుకూరు: గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 5వ వర్ధంతిని ఆయన అభిమాని బాలమల్లేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాలసుబ్రహ్మణ్యం తన పాటలతో ప్రజల మనస్సుల్లో స్థిరస్థాయిగా ఉంటారని చెప్పారు. ఆయన లేని లోటు సినీ ప్రపంచంలో కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ జి.సుధాకర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386